సాక్షి
ప్రకాశం
బుధవారం । 30 । ఏప్రిల్ । 2025



ఆటకు ఆహ్వానం

జిల్లాలోని 50 కేంద్రాల్లో మే 1 నుంచి 31వ తేదీ వరకు విద్యార్థులకు సమ్మర్ కోచింగ్ క్యాంపులు నిర్వహించనున్నారు. - 8లో..



ఫ్లోరైడ్ సమస్యకు చరమగీతం

జిల్లాలో ఫ్లోరైడ్ సమస్యకు చరమగీతం పాడాలని 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ అన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
39 /26

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.

న్యూస్‌రీల్

నేడు వెల్లంపల్లి బోర్డుకు రానున్న వైవీ సుబ్బారెడ్డి



మద్దిపాడు: గిట్టుబాటు ధరలు లేక ఇబ్బందులు పడుతున్న పొగాకు రైతుల కష్టాలు తెలుసుకునేందుకు రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి వెల్లంపల్లి పొగాకు బోర్డును బుధవారం సందర్శించనున్నారు. ఆయనతో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, పలువురు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్‌లు రానున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొనాల్సిందిగా మాజీ మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున విజ్ఞప్తి చేశారు.

ఆక్రమణలకు గురైన వక్ఫ్ భూములను గుర్తించాలి

● డీఆర్వో బి.చిన ఓబులేసు

ఒంగోలు సబర్బన్: ఆక్రమణలకు గురైన వక్ఫ్ భూములను విడిపించి తిరిగి ఆయా సంస్థలకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు చెప్పారు. జిల్లా వక్ఫ్ పరిరక్షణ కమిటీ సమావేశం మంగళవారం ప్రకాశం భవనంలో డీఆర్‌ఓ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లాలో 1,542 ఎకరాల వక్ఫ్ భూమి ఆక్రమణకు గురైనట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి చెప్పినట్లు ఆయన తెలిపారు. ఆక్రమణల నుంచి వాటిని విడిపించడంతోపాటు వక్ఫ్ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వచ్చే సమావేశం నాటికి ఈ దిశగా చేపట్టిన చర్యల నివేదికలను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా వక్ఫ్ బోర్డ్ ఇన్‌స్పెక్టర్ ఆడిటర్ షేక్ అహమద్ బాష, ఒంగోలు ఆర్‌డీఓ లక్ష్మీ ప్రసన్న, డీపీఓ జి.వెంకట నాయుడు, జిల్లా రిజిస్ట్రార్ బాల ఆంజనేయులు, ఆర్‌అండ్‌బీ ఈఈ గోపీ నాయక్, సర్వే, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పెట్టుబడులు వస్తాయంతే..



టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెం గ్రామానికి చెందిన దామచర్ల చిన్నరాజ మూడు బ్యార్నీలకు పొగాకు సాగు చేశాడు. ఇప్పటికి రెండు రౌండ్లు వేలం పూర్తవుతున్నా ధరల్లో ఎటువంటి పెరుగుదల లేదు. పొగాకు సాగు ఖర్చు ఎక్కువైంది. ఖర్చులకు తగ్గట్లు ధరలు లేవు. బోర్డు అధికారులు, పొగాకు కంపెనీల ప్రతినిధులు సిండికేట్ అయి ధరల పెరుగుదల విషయంలో చొరవ చూపడం లేదు. ఒకటి కౌలు బ్యార్నీ, రెండు సొంత బ్యార్నీలు, సొంత పొలం కావడంతో పెట్టిన పెట్టుబడి వరకు వస్తుంది. కౌలు రైతులకు మాత్రం లక్షల్లో నష్టాలు తప్పవు. ఇప్పటికైనా నా మేలిమి పొగాకుకే కాదు లోగ్రేడు పొగాకును కూడా సరైన ధరలకు కొనుగోలు చేసి పొగాకు రైతులను ఆదుకోవాలని చిన్నరాజ కోరుతున్నాడు. వేలంలో అన్ని పొగాకు కంపెనీలు పాల్గొనాలని, ధరలపై బోర్డు అధికారులు శ్రద్ధ చూపాలన్నారు.



టంగుటూరు పొగాకు వేలం కేంద్రం

ధరలు కోసి.. పొగబెట్టారు!

పొగాకు రైతుల పరిస్థితి గందరగోళంగా ఉంది. వేలం కేంద్రాల్లో సరైన ధర లభించక దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. పంట చేతికొచ్చిన సమయంలో వ్యాపారులు ధర తగ్గించేసి కొనుగోళ్లు చేస్తుండడంతో రైతులు అల్లాడిపోతున్నారు. కనీసం పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు. అండగా నిలవాల్సిన బోర్డు అధికారులు, ప్రభుత్వం వీరిని గాలికి వదిలేయడంతో వ్యాపారులు సిండికేటై రైతును నట్టేట ముంచేస్తున్నారు. ఇప్పటికే పలు దఫాలుగా రైతులు ఆందోళన చేసినా ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. టీడీపీ ఎప్పుడు అధికారంలోకి వచ్చినా సంక్షోభంలోకి కూరుకుపోతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు.

- టీడీపీ పాలనలో ప్రతిసారి నష్టాలు మూటగట్టుకుంటున్న రైతులు
- వేలం ప్రారంభమై 50 రోజులు గడుస్తున్నా పుంజుకోని ధరలు
- రైతుల ఆందోళనను పట్టించుకోని కూటమి పాలకులు
- సిండికేట్లతో మోసపోతున్న పొగాకు రైతులు
- నాణ్యత పేరుతో మెజార్టీ బేళ్లను తిరస్కరిస్తున్న వ్యాపారులు
- ధరలు రాక ఉసూరుమంటూ వెనక్కి తీసుకుపోతున్న రైతులు
- ఆత్మహత్యలే శరణ్యమని వేదన
- వైఎస్సార్ సీపీ పాలనలో నాలుగేళ్లు లాభాల పంట

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ప్రకాశం రీజియన్ పరిధిలో ఆరేళ్ల కిందట 20 నుంచి 25 వేల ఎకరాల్లో మాత్రమే పొగాకు సాగు చేసేవారు. నాలుగేళ్లుగా పొగాకు పంటకు మంచి గిట్టుబాటు ధరలు రావడంతో పంట విస్తీర్ణం పెరుగుతూ వచ్చింది. పొగాకు బోర్డు ఈ ఏడాది 68,500 హెక్టార్లలో సాగుకు అనుమతి ఇచ్చింది. అయితే కొన్ని కంపెనీలు, దళారులు రైతులను ఎక్కువ పంట సాగుచేసేలా ప్రోత్సహించారు. ఆకాశమే హద్దు అంటూ ఊరించారు. పొగాకు బోర్డు అధికారులు కూడా 20 శాతం వరకు అధికంగా పంట వేసుకోవచ్చని చెప్పడంతో రైతులు గుడ్డిగా నమ్మారు. గత ఏడాది ఒక రైతుకు 35 క్వింటాళ్ల అనుమతి ఇవ్వగా ఈ ఏడాది 45 క్వింటాళ్ల అనుమతి ఇచ్చారు. దాంతో నాలుగు డబ్బులు వస్తాయన్న ఆశతో రైతులు ఎక్కువ విస్తీర్ణంలో పంటసాగు చేశారు. ఈ ఏడాది సుమారు 88 వేల హెక్టార్లలో పొగాకు సాగు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. 105.27 మిలియన్ కిలోలకు పైగా పంట ఉత్పత్తి అంచనా వేయగా 162 మిలియన్ కిలోలుగా ఉత్పత్తి అయ్యే అవకాశాలు ఉన్నాయని మార్కెట్ వర్గాలు లెక్కలు వేస్తున్నాయి.

సాగులోకి దిగిన బడుగు రైతులు

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది సన్నకారు, చిన్నకారు రైతులు రంగంలోకి దిగారు. ముఖ్యంగా ఎస్సీలు, బీసీలు, కౌలు రైతులు పొగాకు సాగులోకి దిగారు. పొగాకు పంటకు గిరాకీ ఉండడంతో అధిక కౌలు చెల్లించేలా ఒప్పందం చేసుకున్నారు. కౌలు రైతులకు బ్యాంకులు రుణాలు ఇవ్వకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో బయటి వ్యక్తుల దగ్గర అధిక వడ్డీలకు రుణాలు తీసుకొని సాగు చేశారు. అయితే అధిక వర్షాలు మొదట్లోనే దెబ్బ తీశాయి. ఒకటికి రెండు సార్లు నాట్లు వేయాల్సి వచ్చింది. వర్జీనియా పొగాకు దిగుబడి 20 నుంచి 30 శాతం వరకు తగ్గింది. ప్రభుత్వ నిర్లక్ష్యం, వ్యాపారుల గోతి కాడి నక్కల్లాంటి తీరు రైతులను ఆందోళనకు గురిచేస్తోంది.

నాణ్యత పేరుతో మోసానికి దిగిన వ్యాపారులు...

ఎన్నో ఆశలు పెట్టుకొని పొగాకు సాగు చేసిన రైతుకు బోర్డు అధికారులు, వ్యాపారులు, దళారులు కలిసి టోపీ పెట్టే కుట్రలకు తెరలేపారు. అధికంగా సాగు చేశారని, నాణ్యత బాగా లేదని సాకులు చెబుతూ తక్కువ ధరలకు పొగాకు కొనుగోలు చేస్తున్నారు. మార్చి 10న పొగాకు కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. రీజియన్ పరిధిలోని 11 వేలం కేంద్రాల్లో దశల వారీగా కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. గత ఏడాది బ్రైట్ ధర రూ.360 పలకగా ఈ ఏడాది రూ.280 కంటే తక్కువకు కొనుగోలు చేస్తున్నారు. బ్రైట్ మీద ఏకంగా రూ.80 పైగా నొక్కేస్తున్నారు. అదికూడా మొత్తం పొగాకును ఒకే ధరకు కొనుగోలు చేయడం లేదు. వేలం కేంద్రాలకు వచ్చిన వాటిలో కేవలం 10 శాతం మాత్రమే కొనుగోలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. తక్కువ ధరలకు అమ్ముకుంటే రైతులకు వచ్చేదేమీ లేదు. తీవ్రమైన నష్టాలకు గురికావల్సి వస్తుంది.

నిర్లక్ష్యంగా కూటమి పాలకులు...

పొగాకు వేలం ప్రారంభమై 50 రోజులు దాటింది. అయినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. పంట విస్తీర్ణం, దిగుబడి, ప్రస్తుతం కొనుగోలు ధరలను సమీక్షించిన దాఖలాలు లేవు. పైగా మమ్మల్ని అడిగి సాగు చేశారా అంటూ అగ్రికల్చరల్ జాయింట్ డైరెక్టర్ చెప్పడంపై తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పొగాకు బోర్డు అధికారులు అధిక సాగుకు ప్రోత్సహించడం వల్లే ఈ ఏడాది రైతులు అధికంగా సాగు చేశారన్న సంగతి తెలియకుండా జేడీ మాట్లాడడం వివాదాస్పదమైంది. గత ఏడాదికంటే తక్కువ ధరకు కొనుగోళ్లు చేస్తున్నా ఇప్పటి వరకు మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించకుండా రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తుండడంపై రైతులు మండిపడుతున్నారు.

పొగాకు రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కూడా ఒకసారి ఇలాంటి పరిస్థితి వచ్చినప్పుడు నాటి ప్రభుత్వం పొగాకు రైతులకు అండగా నిలబడింది. 2019–20లో ఇలాంటి పరిస్థితి వచ్చినప్పుడు నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేరుగా రంగంలోకి దిగారు. మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి మార్కెట్‌లో పోటీ పెరిగేలా చర్యలు తీసుకున్నారు. దీంతో రైతులు నష్టపోకుండా సరైన ధరలకు అమ్ముకుని లాభాలు మూటగట్టుకున్నారు.

పొగాకు రైతులను ఆదుకోవాలి



పొగాకు పంట సాగు చేసిన రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. గత ఏడాది ధరలు ఆశాజనకంగా ఉండటంతో పాటు వ్యాపారులు, కంపెనీలు, పొగాకు బోర్డు అధికారుల ప్రోత్సాహంతో ఈ ఏడాది అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. వాతావరణం సానుకూలంగా లేకపోవడం, కలుపు, మల్లె ఎక్కువగా వేయడంతో దిగుబడి బాగా తక్కువగా వచ్చింది. అయినా వ్యాపారులు రకరకాల సాకులు చెబుతూ తక్కువ ధరకు కొనుగోలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. దీని వలన రైతులకు తీవ్ర నష్టం జరుగుతుంది. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించకపోవడం దారుణం. ప్రభుత్వం పట్టించుకోకపోతే చాలా కుటుంబాలు నష్టాల బారిన పడి కోలుకోని దుస్థితి దాపురిస్తుంది. తక్షణమే ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి ఏజెన్సీల ద్వారా కొనుగోలు చేయించాలి.

– చుండూరి రవిబాబు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త

వెనక్కిపోతున్న బేళ్లు...

కూటమి పాలకుల రైతు వ్యతిరేక విధానాలతో చరిత్రలో మొదటిసారిగా వేలం కేంద్రానికి వచ్చిన బేళ్లు వందల సంఖ్యలో వెనక్కి పోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పదుల సంఖ్యలో మాత్రమే బేళ్లు వెనక్కి వెళ్లేవి. కానీ ప్రస్తుతం ఒక్కో వేలం కేంద్రంలోనే వందల సంఖ్యలో బేళ్లు వెనక్కి వెళుతున్నాయి. కొనుగోళ్లు ప్రారంభమైన తరువాత ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోకపోవడంతో ఎక్కడి పంట అక్కడే ఉంది. వ్యాపారులు, దళారుల సిండికేట్ మాయాజాలంతో రైతులు పంట అమ్ముకునే పరిస్థితి లేకుండా పోయింది. ఇప్పటి వరకు కేవలం 9.2 మిలియన్ కేజీలో పొగాకు మాత్రమే కొనుగోలు చేసినట్లు బోర్డు అధికారులు చెబుతున్నారు. ఒక్క టంగుటూరు వేలం కేంద్రం నుంచే రోజుకు వందకు పైగా బేళ్లు వెనక్కి పోతున్నాయి. అయినప్పటికీ పాలకులు మొద్దునిద్ర వీడడం లేదనే విమర్శలు వినవస్తున్నాయి. 2014 నుంచి 2019 వరకు తెలుగుదేశం పార్టీ హయాంలో కూడా ఇదే పరిస్థితి నెలకొందని, జిల్లాకు చెందిన ఆరుగురు పొగాకు రైతులు ఆత్మహత్య చేసుకోవడం రాష్ట్రంలో సంచలనం రేపిందన్న విషయాన్ని గుర్తుచేసుకుని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడు కూడా రాష్ట్ర ప్రభుత్వం కనుక రంగంలోకి దిగి రైతులను ఆదుకోకపోతే ఆత్మహత్యలు చేసుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



టంగుటూరు వేలం కేంద్రం నుంచి పొగాకు తిరిగి తీసుకుపోతున్న రైతులు

'కంది'పోయిన సంక్షేమం

ఒక్కో సంక్షేమ పథకాన్నీ ఎత్తేస్తున్న కూటమి ప్రభుత్వం చౌకధరల దుకాణాల ద్వారా పంపిణీ చేసే కందిపప్పునకూ మంగళం పాడింది. గత నాలుగు నెలలుగా రేషన్‌షాపుల్లో కందిపప్పు ఇవ్వకుండా కేవలం బియ్యం, పంచదార మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకోవడంతో కార్డుదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మే నెల కోటాలోనూ కందిపప్పు రాకపోవడంతో ఈనెల కూడా వాటి సరఫరా లేనట్లే. మరోవైపు ఈకేవైసీ కాలేదన్న నెపంతో రేషన్ లబ్ధిదారులకు పెద్ద ఎత్తున కోత పెడుతోంది. రాజధాని పేరుతో నిధులన్నీ అమరావతిలో కుమ్మరిస్తూ ప్రజాసంక్షేమాన్ని ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ప్రజలు మండిపడుతున్నారు.

- రేషన్ లబ్ధిదారులకు నాలుగు నెలలుగా నిలిచిన కందిపప్పు సరఫరా
- మే నెలకు కూడా విడుదలకాని కందిపప్పు కోటా
- కూటమి ప్రభుత్వంపై మండిపడుతున్న కార్డుదారులు
- లబ్ధిదారులకు బియ్యం, పంచదార మాత్రమే సరఫరా
- జిల్లాలో రేషన్‌కార్డుల సంఖ్య 6,76,160
- ఈ కేవైసీ చేయించుకోని 1,23,517 మందికి మే నెల రేషన్ లేనట్లే!

బేస్తవారిపేట: కూటమి సర్కారు పాలనలో రేషన్ లబ్ధిదారులకు సరఫరా చేసే కందిపప్పునకు ఎసరు పెట్టింది. కేవలం బియ్యం, పంచదార సరఫరాకే ప్రజా పంపిణీ వ్యవస్థను పరిమితం చేసింది. వరుసగా జనవరి, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో కందిపప్పు ఇవ్వకపోవడంతో కార్డుదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల్లో రేషన్ డిపోల ద్వారా అన్ని రకాల పప్పులు రాయితీ ధరలకు ఇస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి 11 నెలలు కావస్తున్నా పూర్తి స్థాయిలో రేషన్ సరుకులు ఇవ్వలేకపోతున్నారు. బియ్యం తప్ప రెండో సరుకు పూర్తి స్థాయిలో రాకపోవడంతో ప్రజల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. కొద్ది నెలలుగా కందిపప్పులో కోత విధిస్తూ అరకొరగా రావడంతో మొదట వచ్చిన వారికే అందేది. ప్రస్తుతం కందిపప్పు సరఫరాకు పూర్తిగా మంగళం పాడేశారు. ఈనెల కూడా గోదాములకు కందిపప్పు రాలేదు. పంచదార, బియ్యం రేషన్ దుకాణాలకు గోడౌన్‌ల నుంచి సరఫరా చేశారు. కందిపప్పు ధర బహిరంగ మార్కెట్లో కేజీ రూ.130–రూ.150 ఉంది. దీంతో రేషన్ దుకాణాల్లో కందిపప్పునకు డిమాండ్ ఏర్పడింది. ప్రభుత్వం రేషన్‌కార్డుపై కిలో రూ.67 కు అందిస్తున్నారు. ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోని ప్రభుత్వంపై లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అమరావతిలోనే నిధులన్నీ ఖర్చుపెడితే పేదల కడుపు నిండుతుందా అని ప్రశ్నిస్తున్నారు. బడాబాబుల లబ్ధికోసం పేదలకు కేటాయించాల్సిన డబ్బులన్నీ రాజధాని నిర్మాణం పేరుతో జేబుల్లో వేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ప్రభుత్వం రేషన్ దుకాణాల్లో అందించే కందిపప్పు

ఇదీ పరిస్థితి...

జిల్లాలో మొత్తం ప్రభుత్వ రేషన్ దుకాణాలు 1,392, రేషన్‌కార్డులు 6,76,160 ఉన్నాయి. నిత్యావసర ధరలు పెరిగిన నేపథ్యంలో పేద, మధ్య తరగతి ప్రజలు జీవనానికి ఇబ్బందులు పడుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో ఆయిల్, కందిపప్పు ధరలు ఆకాశాన్నంటడంతో కొనుగోలు చేయడం తలకుమించిన భారంగా మారింది. ప్రభుత్వం రాయితీపై రేషన్ షాపుల్లో కందిపప్పు సరఫరా చేయాలని కార్డుదారులు కోరుతున్నారు.

> మే నెల కందిపప్పు రాలేదు
>
> రేషన్‌కార్డుదారులకు మే నెలకు సరఫరా చేసేందుకు కందిపప్పు సరఫరా కాలేదు. ఈ నెల బియ్యం, పంచదార మాత్రమే సరఫరా చేస్తాం.
>
> – సూరా రామనారాయణరెడ్డి, రేషన్ డీటీ

ఈకేవైసీ గండం...

జిల్లాలోని 38 మండలాల్లో 19,37,977 మందికి ఈ-కేవైసీ చేయించుకోవాల్సి ఉంది. ఇప్పటికి 17,93,769 మంది చేయించుకున్నారు. ఇందులో 0–5 ఏళ్లలోపు పిల్లలు 18,861, 80 ఏళ్ల పైబడినవారు 1830 మంది ఈకేవైసీ చేయించుకోవాల్సిన అవసరం లేదు. ప్రోగ్రెస్‌లో 85,355 మంది ఉన్నారు. 1,23,517 మంది ఈకేవైసీ చేయించుకోవాల్సినవారు ఉన్నారు. వీరందరికీ మే నెలలో రేషన్ అందే పరిస్థితి లేదు.

వైఎస్సార్ సీపీ ఒంగోలు, నెల్లూరు, విశాఖ పార్లమెంట్ల

పరిశీలకులుగా బత్తుల, జంకె, కదిరి

ఒంగోలు టౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఒంగోలు, నెల్లూరు, విశాఖపట్నం పార్లమెంట్‌లకు పార్టీ పరిశీలకులను నియమించారు. ఆమేరకు పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఒంగోలు పార్లమెంట్ పరిశీలకునిగా బత్తుల బ్రహ్మానంద రెడ్డిని నియమించారు. పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్లకు అనుసంధానంగా ఆయన పనిచేస్తారు. అదేవిధంగా ఏపీఐఐసీ మాజీ చైర్మన్, మార్కాపురం మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డిని నెల్లూరు పార్లమెంట్ వైఎస్సార్ సీపీ పరిశీలకునిగా నియమించారు. జంకె వెంకట రెడ్డి గతంలో ప్రకాశం జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షునిగా పనిచేశారు. రెండుసార్లు మార్కాపురం ఎమ్మెల్యేగా ఉన్నారు. గత ప్రభుత్వంలో ఏపీఐఐసీ చైర్మన్‌గా పనిచేశారు. వైఎస్సార్ సీపీ విశాఖపట్నం పార్లమెంట్ పరిశీలకుడిగా కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావును నియమించారు.



బ్రహ్మానంద రెడ్డి



జంకె వెంకటరెడ్డి



కదిరి బాబూరావు

పాకిస్థానీ పౌరుల వీసాలు రద్దు

● కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: పాకిస్థానీ పౌరులకు భారత ప్రభుత్వం జారీచేసిన అన్ని చెల్లుబాటు అయ్యే వీసాలు ఈనెల 27 నుంచి రద్దయినట్లు కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. పాకిస్థానీ పౌరులకు భారత ప్రభుత్వం జారీచేసిన వీసాలపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ నేపథ్యంలో మెడికల్ వీసాలు, లాంగ్ టర్మ్ వీసాలు, దౌత్య, అధికారిక వీసాలు మినహా మిగతా అన్ని చెల్లుబాటయ్యే వీసాలు రద్దయినట్లు చెప్పారు.

అడుగు ముందుకు పడని వీరయ్య కేసు

- కొనసాగుతున్న రోజువారి విచారణ
- మరో నలుగురిని తీసుకొచ్చి విచారిస్తున్నట్లు ప్రచారం
- తనకు ఎలాంటి సంబంధం లేదంటూ ఓ టీవీ చానల్‌లో ముప్ప సురేష్

ఒంగోలు టౌన్: రాష్ట్రంలో సంచలనం రేకెత్తించిన టీడీపీ నాయకుడు వీరయ్యచౌదరి హత్య కేసులో విచారణ ఒక్క అడుగు కూడా ముందుకు పడడంలేదు. ఒంగోలులోని ఆయన కార్యాలయంలో వీరయ్య చౌదరి హత్యకు గురై మంగళవారానికి 8 రోజులు కావస్తోంది. చీమకుర్తిలో నిందితులు ఉపయోగించిన స్కూటీ దొరికిన తరువాత ఇంకేముంది..విచారణ పూర్తయినట్లేనని అంతా భావించారు. ఆ రోజంతా హడావుడిగానే సాగింది. అయితే కీలక అనుమానితుడిని పోలీసులు అదుపులోకి తీసుకోవడం మినహా పెద్దగా పురోగతి సాధించలేదు. అమ్మనబ్రోలుకు చెందిన టీడీపీ యువ నాయకుడు ప్రధాన అనుమానితుడిగా నిర్ధారించినట్లు ప్రచారం జరిగింది. ముంగమూరు రోడ్డులో వీరయ్య హత్య కేసులో నిందితులు ఉపయోగించిన రెండో వాహనం మోటారు బైకును స్వాధీనం చేసుకున్న తరువాత కొప్పోలుకు చెందిన ఒక వ్యక్తిని ప్రధాన పాత్రధారుడిగా పోలీసులు విచారణలో గుర్తించినట్టు తెలిసింది. ఒక్కో వాహనం దొరికినప్పుడల్లా ఒకరి పేరు ప్రచారంలోకి వస్తుంది తప్పిస్తే అసలు నిందితులను పోలీసులు నిర్ధారించడంలేదని చెప్పుకుంటున్నారు. ప్రస్తుతానికి ఈ హత్యకేసులో సూత్రధారుడిగా భావిస్తున్న వారు పోలీసుల అదుపులోనే ఉన్నారు. పాత్రధారుడిగా చెబుతున్న వ్యక్తి కోసం వైజాగ్‌లో గాలిస్తున్నారు. అయితే అతను వైజాగ్‌లోనే ఉంటే రోజుల తరబడి గాలిస్తున్న పోలీసుల బృందం కనీసం ఒక చిన్న క్లూ కూడా సాధించలేకపోవడం గమనార్హం.



హత్యకు గురైన వీరయ్య చౌదరి మృతదేహం (ఫైల్)

మీడియాతో మాట్లాడిన ముప్ప సురేష్

ఇదిలా ఉండగా వీరయ్య చౌదరి హత్య కేసులో మరో సూత్రధారుడిగా ప్రచారంలో ఉన్న బంగారు వ్యాపారి ముప్ప సురేష్ మంగళవారం ఓ టీవీ చానల్‌తో మాట్లాడడం సంచలనం సృష్టించింది. వీరయ్య చౌదరి హత్యతో తనకెలాంటి సంబంధంలేదని స్పష్టం చేశారు. హత్య జరిగిన తరువాత మీడియాలో తన పేరు రావడంతో షాక్‌కు గురయ్యానని చెప్పారు. రాజకీయంగా కానీ, వ్యాపార పరంగా కానీ ఆయనతో ఎదురుపడిన సందర్భాలు కూడా లేవని చెప్పడమే కాకుండా తాను ఎక్కడకూ పోలేదని, హైదరాబాద్‌లోనే ఉన్నానని చెప్పడం చర్చనీయాంశమైంది. ఇన్నాళ్లు పోలీసులు ఆయన కోసం హైదరాబాద్‌లో గాలిస్తున్నట్లు చెప్పారు. కానీ ఆయన మాత్రం తానెక్కడకూ పోలేదని చెబుతున్నారు. ఇందులో ఏది నిజమో ముందు విచారణలో తెలియాల్సి ఉంది. నిన్నటి వరకు అనేక మందిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్న పోలీసులు మరో నలుగురిని తీసుకొచ్చి విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

నేడు పాలిసెట్

ఒంగోలు సిటీ: పాలిసెట్ ఎంట్రెన్స్ పరీక్ష బుధవారం నిర్వహించనున్నట్లు ఒంగోలులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ శివప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలులోని 7 కేంద్రాల్లో, మార్కాపురంలో 4 కేంద్రాల్లో 4,600 మంది పరీక్ష రాయనున్నట్లు చెప్పారు. ఉదయం 9 గంటలకల్లా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. పరీక్ష ప్రారంభమైన 11 గంటల తర్వాత ఎవరినీ పరీక్ష కేంద్రంలోకి అనుమతించరన్నారు. పాలిసెట్ పరీక్ష నిర్వహించడానికి అన్నీ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. అభ్యర్థులతో పాటు హాల్‌టికెట్, పెన్, పెన్సిల్, ఎరైజర్ మాత్రమే పరీక్ష హాల్‌లోకి అనుమతిస్తారన్నారు.

క్లుప్తంగా

ఉదయ్‌కృష్ణారెడ్డికి సీఎం ప్రశంసలు


ఉదయ్ కృష్ణారెడ్డి

సింగరాయకొండ: సివిల్ ఫలితాల్లో జాతీయస్థాయిలో 350వ ర్యాంకు సాధించిన మండలంలోని ఊళ్లపాలెం గ్రామానికి చెందిన ఎం ఉదయ్‌కృష్ణారెడ్డిని మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారాలోకేష్ ఎక్స్ వేదికగా ప్రశంసించారు. ఒక ప్రభుత్వ పాఠశాల విద్యార్థి పోలీస్ కానిస్టేబుల్ నుంచి ఐపీఎస్ అధికారి వరకు అతని ప్రయాణం ధైర్యసాహసాలు, త్యాగం, అవిశ్రాంత సంకల్పం స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు.

వెలిగొండ నిర్వాసితులకు న్యాయం చేయండి

- సబ్ కలెక్టర్ త్రివినాగ్‌కు వినతి


సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న గాలి వెంకటరామిరెడ్డి

మార్కాపురం: పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ముంపునకు గురవుతున్న గొట్టిపడియ, అక్కచెరువు, సుంకేశుల, కలనూతల, గుండంచర్ల, లక్ష్మీపురం, కృష్ణానగర్, సాయిరామ్‌నగర్, లింగాపురం, సాయినగర్, చింతలముడిపి గ్రామాల్లోని నిర్వాసితులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ అమలు చేయాలని నిర్వాసితుల సంఘ కార్యదర్శి గాలి వెంకటరామిరెడ్డి, ఒంటిద్దు చిన్న రంగారెడ్డి తదితరులు మంగళవారం సబ్‌కలెక్టర్ త్రివినాగ్‌కు వినతిపత్రం అందించారు. మళ్లీ ఆర్థిక సర్వే నిర్వహించి, అర్హులైన వారిని ఆర్‌ఆర్ ప్యాకేజీ జాబితాలో చేర్చాలని విన్నవించారు. ప్రాజెక్టు మిగులు పనులను త్వరగా పూర్తిచేసి కృష్ణా నీటిని విడుదల చేయాలని కోరారు. వీరి వెంట పలువురు నిర్వాసితులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి


కిరణ్ మృతదేహం

పెద్దారవీడు: ఎదురెదురుగా వస్తున్న లారీ, ట్రాలీ ఆటో ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందారు. ఈ సంఘటన మండలంలోని సానికవరం– మద్దలకట్ట గ్రామాల మధ్య రామకృష్ణ ధ్యాన మందిరం దగ్గర మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు కర్నాటక రాష్ట్రం నుంచి ట్రాలీ ఆటో లోడుతో గుంటూరుకు వెళ్తుంది. గుంటూరు నుంచి లారీ లోడుతో కర్నూల్‌కు వెళ్తుంది. రామకృష్ణ ధ్యాన మందిరం దగ్గరకు రాగానే రెండు వాహనాలు ఢీకొట్టుకోవడంతో ట్రాలీ ఆటో డ్రైవర్ కిరణ్ (32) అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడు కిరణ్ కర్నాటక రాష్ట్రం హుబ్లి దగ్గర లక్కహుండి గ్రామ వాసిగా గుర్తించారు. లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గాయాలైన డ్రైవర్‌ను స్థానికులు 108 అంబులెన్స్‌లో మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కిరణ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆటకు ఆహ్వానం



జిల్లా వ్యాప్తంగా 50 కేంద్రాల్లో సమ్మర్ కోచింగ్ క్యాంపులు

- ఒంగోలులో 11 కేంద్రాల్లో శిక్షణకు అనుమతి
- మే 1 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించాలని ఆదేశం
- ఒక్కో శిబిరం నిర్వహణకు రూ.7 వేలు ప్రకటించిన 'శాప్'
- ఇతరత్రా ఖర్చుల భారం దాతలపైనే..

ఒంగోలు: పుస్తకాలతో కుస్తీ పట్టిన చిన్నారులకు ఆట విడుపు ప్రారంభమైంది. నిత్యం సెల్ ఫోన్, టీవీలకు అతుక్కుపోతూ ఒంటరితనానికి అలవాటుపడుతున్న విద్యార్థులు ఆరుబయట ఆటాడుకునేందుకు క్రీడా ప్రాంగణాలు ఆహ్వానిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో మొత్తం 26 రకాల క్రీడాంశాలపై క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నారు. అయితే వీటిలో 22 ఆటలకు శిక్షణ ఒంగోలులోని వివిధ క్రీడా ప్రాంగణాల్లో లభించనుంది. మే ఒకటో తేదీ నుంచి 31వ తేదీ వరకు శిక్షణ కొనసాగనుంది.

శాప్ కొంత.. దాతలపైనే భారమంతా!

రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల ప్రకారం ప్రతి జిల్లాలో 50 క్యాంపులు నిర్వహించాల్సి ఉంది. అందులో భాగంగా ప్రకాశం జిల్లాలోనూ 50 క్యాంపులు నిర్ణయించారు. ఒక్కో క్యాంపు నిర్వహణకు రూ.7 వేలు ఇస్తారు. వీటిలో క్రీడా సామగ్రికి రూ.5 వేలు వెచ్చించాలి. శిక్షకులకు గౌరవ వేతనంగా రూ.1500 ఇవ్వాలి. మిగిలిన రూ.500ను ఫ్లెక్సీలు, ఇతరత్రా ఖర్చుకు కేటాయించాలని శాప్ ఉత్తర్వుల్లో పేర్కొంది. శిక్షణా కేంద్రం నిర్వహించాలంటే కనీసంగా 20 మంది చిన్నారులు ఉండాలి. వారు కూడా 8 నుంచి 16 ఏళ్ల మధ్య వయసు వారై ఉండాలి. శిక్షణ ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు నిర్వహించాలి. క్యాంపు నిర్వహణ వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం, క్యాంపు ముగింపు రోజున శిక్షణకు వచ్చిన చిన్నారులకు సర్టిఫికెట్లు, మెమొంటోలు, అతిథులకు సత్కారం, క్యాంప్ వద్ద రోజూ మంచి నీరు తదితర ఖర్చులు మొత్తం క్యాంపు నిర్వాహకులు లేదా దాతల నుంచి తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా 50 క్యాంపుల్లో 5 చోట్ల కోచ్‌లు, ఒకచోట అంతర్జాతీయ క్రీడాకారుడు, 12 చోట్ల వ్యాయామ ఉపాధ్యాయులు శిక్షణ ఇవ్వనున్నారు. మిగిలిన శిబిరాల్లో సీనియర్ ప్లేయర్లు శిక్షణ ఇస్తారు.

ఏ శిబిరం ఎక్కడంటే..?

కనిగిరి : బాల్ బ్యాడ్మింటన్
పామూరు : బాస్కెట్‌బాల్
యర్రగొండపాలెం కృషి వికాస కేంద్రం : షటిల్ బ్యాడ్మింటన్, ఖోఖో
సంతనూతలపాడు : షటిల్ బ్యాడ్మింటన్
మార్కాపురం : బాక్సింగ్, ఫుట్‌బాల్, కరాటే, సెపక్ తక్రా, సిలంబం
పాకల : కబడ్డీ
కొత్తపట్నం : కరాటే, కబడ్డీ
గొట్లగట్టు : కబడ్డీ
గురవాజీపేట : బాల్ బ్యాడ్మింటన్
గిద్దలూరు : కరాటే, టెన్నిస్
జమ్ములపాలెం : పవర్ లిఫ్టింగ్, వాలీబాల్
సింగరాయకొండ : టెన్నికాయిట్, రెజ్లింగ్
అల్లూరు : వాలీబాల్
బిట్రగుంట : రెజ్లింగ్
తూర్పు గంగవరం : హ్యాండ్‌బాల్

ఒంగోలులోని కేంద్రాల్లో శిక్షణ ఇలా..

ఏబీఎం జూనియర్ కాలేజీ : ఆర్చరీ, ఫుట్‌బాల్
పోలీస్ పరేడ్ గ్రౌండ్ : అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, వాలీబాల్
డీఆర్‌ఆర్‌ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాల : బాల్ బ్యాడ్మింటన్
మినీ స్టేడియం : బాస్కెట్‌బాల్, బాక్సింగ్, చెస్, ఫెన్సింగ్, మార్షల్ ఆర్ట్స్, సెపక్ తక్రా, వాలీబాల్
కర్నూల్ రోడ్డు శ్రీరామ స్కూల్ : హ్యాండ్‌బాల్
హైదరీ క్లబ్ : కరాటే
భారతీయ జాతీయ వ్యాయామ కళాశాల : పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్
రైఫిల్ షూటింగ్ : నెక్స్‌జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ (కొప్పోలు)
రామ్‌నగర్ 12వ లైను : స్కేటింగ్, స్విమ్మింగ్
తైక్వాండో : సీవీఎన్ రీడింగ్ రూమ్
మంగమూరు డొంక : వుషు, యోగా

లార్డ్ కృష్ణా బ్యాడ్మింటన్ అకాడమీలో..

లార్డ్ కృష్ణా బ్యాడ్మింటన్ అకాడమీలో వేసవి శిక్షణ శిబిరాన్ని మే ఒకటో తేదీ నుంచి 31వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. ఉదయం 6 నుంచి 7.30 గంటల వరకు, 9 నుంచి 10.30 గంటల వరకు, సాయంత్రం 5.30 నుంచి 7 గంటల వరకు కోచ్‌ల పర్యవేక్షణలో చిన్నారులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఆసక్తి ఉన్నవారు 93982 60109, 8328298418ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు అద్దంకి మురళీకృష్ణ సూచించారు.


ఒంగోలులోని మినీ స్టేడియం

డ్రగ్స్ నియంత్రణపై ప్రజల్లో చైతన్యం నింపాలి


ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

ఒంగోలు సిటీ: డ్రగ్స్ రహిత సమాజ స్థాపనలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఆంధ్రకేసరి యూనివర్శిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. రాజమోహన్ రావు అన్నారు. స్థానిక ఆంధ్రకేసరి యూనివర్శిటీ ప్రాంగణంలో నిర్వహించిన డ్రగ్స్ నియంత్రణ అవగాహనా ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమానికి యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ మండే హర్ష ప్రీతం దేవ్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజమోహన్ రావు మాట్లాడుతూ సమాజాన్ని అంటురోగం మాదిరిగా పట్టి పీడిస్తున్న మద్యం మహమ్మారి, డ్రగ్స్ వినియోగం, గంజాయి, సిగిరెట్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను యువతీ యువకులైన విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అదే సమయంలో వాటిని వినియోగించడం వల్ల కుటుంబ ఆర్థిక వ్యవస్థపై ఎటువంటి ప్రభావం చూపుతుందో తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ మండే హర్ష ప్రీతం దేవ్ కుమార్ మాట్లాడుతూ నేటి యువత నవ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని, ఇందులో భాగంగా డ్రగ్స్ వినియోగాన్ని సమాజానికి దూరం చేసేందుకు నాంది పలకాలన్నారు. విద్యార్థులు తొలుత తమ స్వగ్రామంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని నినాదాలు చేశారు. యూనివర్శిటీ నుంచి నుంచి జాతీయ రహదారి వరకు ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏకేయూ బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లోరైడ్ సమస్యకు చరమగీతం

- 20 సూత్రాల అమలు కార్యక్రమం చైర్మన్ లంకా దినకర్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న లంకా దినకర్, పక్కన అధికారులు

ఒంగోలు సబర్బన్: ఫ్లోరైడ్ సమస్యకు చరమగీతం పాడితేనే వికసిత భారత్‌లో ప్రకాశం జిల్లా భాగస్వామ్యం కాగలదని రాష్ట్ర 20 సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో తొలుత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా అవసరమైన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన ద్వారా తాగునీరు, ఫ్లోరైడ్ సమస్య, యర్రగొండపాలెం ఏస్పిరేషన్ బ్లాక్‌లో కేంద్ర పథకాల అమలు తీరుపై జిల్లా అధికారులతో సమీక్షించామన్నారు. జిల్లాలో ఒక వైపు తాగు, సాగు నీరు ఇబ్బందులుంటే, పశ్చిమ ప్రకాశం జిల్లాలో ఫ్లోరిడ్ తీవ్రత ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. జిల్లాలో 729 పంచాయతీల్లోని 1,769 గ్రామాల్లో 1009 గ్రామాలు ఫ్లోరైడ్ సమస్యతో ఉన్నాయని, ప్రస్తుతం ఫ్లోరైడ్ సమస్యను ఎదుర్కోవడానికి మొత్తం 27 గ్రామాల్లో సురక్షిత తాగు నీటి సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. కనిగిరి పరిధిలో ఎక్కువగా 339, దర్శి పరిధిలో 120, మార్కాపురం పరిధిలో 113 గ్రామాల్లో ఫ్లోరైడ్ సమస్య తీవ్రంగా ఉందన్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలో 52 గ్రామాల్లో , కొండపిలో, ఎస్ఎన్‌పాడులో 25, ఒంగోలు మండలంలోని ఒక గ్రామంలో ఫ్లోరైడ్ సమస్య ఉందన్నారు. డయాలసిస్ సెంటర్, వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్స్ ఏర్పాటు ద్వారా జిల్లాలో కిడ్నీ బాధితులను ఆదుకోవడానికి సీఎస్ఆర్ నిధులను రాబట్టాల్సిన అవసరం ఉందన్నారు. 16 వ ఆర్థిక సంఘం ప్రతినిధులకు ఫ్లోరైడ్ సమస్య ఉన్న ప్రాంతాలకు అదనపు గ్రాంట్ ఇవ్వాలని కోరామన్నారు. కనిగిరి నియోజకవర్గం, కొండపిలోని మర్రిపూడి మండలంలో పూర్తి స్థాయిలో సురక్షిత తాగునీరు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం కనిగిరిలో ఒక డయాలసిస్ సెంటర్‌లో నెలకు 120 మందికి సేవలు అందిస్తున్నారని, ఇంకా ఎన్ని అవసరమో ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో సీపీఓ వెంకటేశ్వర్లుతో జిల్లాలోని అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

జిల్లాకు 1305 యూనిట్లు మంజూరు

- ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్


మాట్లాడుతున్న అర్జున్ నాయక్

మార్కాపురం: ఎస్సీ కార్పొరేషన్ పరిధిలో జిల్లాకు 1305 యూనిట్లు మంజూరైనట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఉన్న 38 మండలాలు, 8 మున్సిపల్ కార్పొరేషన్లు కలిపి వీటిని మంజూరు చేశామన్నారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. లబ్ధిదారులు యూనిట్లు పొందిన తరువాత ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. ఈయన వెంట ఎంపీడీఓ శ్రీనివాసులు ఉన్నారు.

బాధ్యతగా పనిచేస్తేనే రైల్వేకు ఆదాయం


మాట్లాడుతున్న ఏడీఆర్‌ఎం సైమన్


సమావేశంలో పాల్గొన్న సిబ్బంది

దొనకొండ: రైల్వే శాఖలో ప్రతి ఉద్యోగి బాధ్యతగా పని చేసి మంచి పేరు తెచ్చుకోవాలని ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ వెంకటరామిరెడ్డి తెలిపారు. స్థానిక రైల్వే ఫంక్షన్ హాల్లో మంగళవారం రైల్వే శాఖ సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగుల పని తీరు, ఇతర విషయాలను క్షుణ్ణంగా పరిశీలించేందుకు రైల్వే స్టేషన్లను రెండు నెలలకోసారి తనిఖీ చేస్తున్నామన్నారు. దొనకొండ రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులకు సంబంధించిన విషయాలను రైల్వే ఉన్నతాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగులు బాధ్యతగా విధులు నిర్వర్తించినపుడే రైల్వే శాఖకు ఆదాయం సమకూరుతుందని చెప్పారు. ఈ సందర్భంగా రైల్వే ఉన్నతాధికారులను సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం సైమన్, సీఎస్ఈ భూపనిసింగ్, సీఈడీఈ తోరియా, సీఈటీఎస్ మోనికా వర్మ తదితర ఉన్నతాధికారులు, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

'నీట్'గా.. ప్రశాంతంగా.. పరీక్షలు నిర్వహించాలి


నీట్ పరీక్షలపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

ఒంగోలు సబర్బన్: జిల్లాలో నీట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. ప్రకాశం భవనంలో మంగళవారం సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. మే నెల 4న జరగనున్న నీట్ పరీక్ష ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే పరీక్షకు మొత్తం 1,473 మంది అభ్యర్థులు హాజరవుతున్నట్లు చెప్పారు. ఇందుకోసం ఒంగోలు నగరంలోని కేంద్రీయ విద్యాలయం, జవహర్ నవోదయ, దామచర్ల సక్కుబాయమ్మ మహిళా డిగ్రీ కాలేజీ, దామచర్ల ఆంజనేయులు పాలిటెక్నిక్ కాలేజీ, డీఆర్‌ఆర్‌ఎం మున్సిపల్ స్కూల్‌లను కేంద్రాలుగా ఎన్‌టీఏ ఎంపిక చేసిందన్నారు. కేంద్రాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. భద్రత, ప్రశ్నాపత్రాల ఓపెనింగ్, అభ్యర్థుల తనిఖీలు, తదితర విషయాలలో ఎన్‌టీఏ మార్గదర్శకాలను ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇన్విజిలేటర్లకు అవసరమైన శిక్షణ గురువారం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని పరీక్షల సిటీ కో ఆర్డినేటర్‌కు ఆమె సూచించారు. అభ్యర్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసే వాతావరణాన్ని కల్పించే బాధ్యత ఆయా సెంటర్ల సూపరింటెండెంట్లపై ఉందన్నారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ కె.నాగేశ్వరరావు, డీఆర్‌ఓ బి. చిన ఓబులేసు, మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్, ఒంగోలు ఆర్‌డీఓ లక్ష్మి ప్రసన్న, డీపీఓ వెంకట నాయుడు, డీఈఓ కిరణ్‌కుమార్, సిటీ కో ఆర్డినేటర్, ఎన్‌టీఏ నోడల్ ఆఫీసర్ మనీష్ కుమార్, సెంటర్ సూపరింటెండెంట్లు, విద్యుత్, మున్సిపల్, వైద్య, అగ్నిమాపక శాఖల అధికారులు పాల్గొన్నారు.


నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారో చెప్పాలి?


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఒంగోలు టౌన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు దాటినా ఎందుకు నిరుద్యోగ భృతి ఇవ్వడం లేదో చెప్పాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పి. ప్రభాకర్ ప్రశ్నించారు. స్థానిక మల్లయ్య లింగం భవనంలో మంగళవారం ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తక్షణమే రాష్ట్రంలోని నిరుద్యోగులకు రూ.3 వేల చొప్పున భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నిరుద్యోగ యువత సమస్యల పరిష్కారం కోసం తిరుపతి వేదికగా వచ్చే నెల 15 నుంచి 18వ తేదీ వరకు జరగనున్న జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యువజన సమాఖ్య జిల్లా నాయకులు మరియదాసు, రాజు, వంశీ, మార్కు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు

ఒంగోలు సబర్బన్: జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా నేతృత్వంలో రెవెన్యూ అధికారులు బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేశారు. మార్కాపురంలో జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, మార్కాపురం సబ్ కలెక్టర్‌తో పాటు అధికారుల బృందం సివిల్ సప్లయీస్ గోడౌన్‌ను పరిశీలించారు. ఒంగోలులో ఒంగోలు తహశీల్దార్ నేలభట్ల వాసు ఆధ్వర్యంలో ఒంగోలు ఆర్‌ఐ శ్రీకంఠ శ్రీనివాస రావుతో కూడిన అధికారుల బృందం నగరంలోని గోడౌన్‌లను తనిఖీ చేశారు. నగరంలోని బాణసంచా గోడౌన్‌లతో పాటు ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో ఉన్న సివిల్ సప్లయీస్ గోడౌన్‌లో ఉన్న స్టాకును పరిశీలించారు. గ్యాస్ గోడౌన్లు, పెట్రోల్ బంకులు, సినిమా హాళ్లలో తనిఖీలు చేశారు.


సివిల్ సప్లయీస్ గోడౌన్‌లో స్టాకు పరిశీలిస్తున్న తహసీల్దార్ వాసు

రీ సర్వే ప్రక్రియ పటిష్టంగా చేయాలి

ఒంగోలు సబర్బన్: జిల్లాల్లో రీసర్వే ప్రక్రియ పటిష్టంగా అమలయ్యేలా చర్యలు చేపట్టాలని సీసీఎల్ఏ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి జిల్లా అధికారులను ఆదేశించారు. విజయవాడ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి మంగళవారం రీసర్వే, ఐవీఆర్ఎస్ ఫీడ్ బ్యాక్, వాటర్ ట్యాక్స్ తదితర అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ జిల్లాల్లో రీసర్వే ప్రక్రియ పటిష్టంగా అమలయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. రీసర్వే సమస్యలు, సిటిజన్ సర్వీసెస్, పీజీఆర్ఎస్ పరిష్కారంపై దృష్టి పెట్టడం అత్యంత ముఖ్యమైనదన్నారు. ఆయా దరఖాస్తులను, సమస్యలను పెండింగ్ లేకుండా సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌కు ఒంగోలు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ తమీమ్ అన్సారియాతో పాటు జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు, జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారి గౌస్ బాషా తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన వక్ఫ్‌బోర్డు సీఈఓ


కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న వక్ఫ్ బోర్డు సీఈఓ మహ్మద్ అలీ

ఒంగోలు సబర్బన్: కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాను వక్ఫ్ బోర్డు సీఈఓ షేక్ మహమ్మద్ అలీ మంగళవారం ప్రకాశం భవన్‌లో కలిశారు. ఒంగోలు వచ్చిన ఆయన కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలోని వక్ఫ్ భూముల స్థితిగతులపై సీఈఓ జిల్లా కలెక్టర్‌తో చర్చించారు.